
సాక్షి ప్రకాశం

శనివారం । 21 । జూన్ । 2025



'పని'కిరాని వాళ్లకు హాజరు

ఉపాధి హామీ పథకాన్ని అవినీతిమయంగా మార్చేశారు. మేట్‌లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. - IIలో..



సోనాబోట్ల విధ్వంసం

మన తీరానికి సమీపంలో కడలూరుకు చెందిన సోనాబోట్లు అక్రమంగా వేటసాగిస్తున్నాయి. దీంతో స్థానిక మత్స్యకారులు నష్టపోతున్నారు. - IIలో..

గరిష్టం/కనిష్టం 39 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పెద్దపులి దాడిలో ఆవుకు గాయాలు

అర్ధవీడు: మండల పరిధిలోని దొనకొండ గ్రామ ఇలాకాలోని బూరుగుల చెరువు సమీపంలో పెద్దపులి, ఆవుపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు దొనకొండ గ్రామానికి చెందిన నాగులుపీరాకు చెందిన ఆవు మేత కోసం అడవికి వెళ్లింది. మందపై పెద్దపులి దాడి చేయగా ప్రాణాలతో తప్పించుకొని ఆవు ఇంటికి వచ్చింది. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. పెద్ద పులుల సంచారం ఉన్నందున పశువులను అడవిలోకి తోలవద్దని డిప్యూటీ రేంజ్ అధికారి ముక్కు ప్రసాదరెడ్డి సూచించారు.

మానవత్వాన్ని చాటుదాం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: ఎంతకాలం జీవిస్తామనేది కాదని, జీవించినంత కాలం మానవత్వాన్ని చాటుతూనే ఉందామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు ఆవరణలో ఇటీవల మరణించిన ముగ్గురు అడ్వొకేట్లు, ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటనలో మరణించిన వారికి, పెహల్గాం ఘటనలో అమరులైన వారికి ఒంగోలు బార్ అసోసియేషన్ సంతాప సభ శుక్రవారం నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి మాట్లాడుతూ జీవితం శాశ్వతం కాదన్నారు. అందుకు ఉదాహరణే పెహల్గాం ఘటనలో యాత్రికులుగా వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వారితోపాటు విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మెడికల్ విద్యార్థుల జీవితాలు అన్నారు. జీవించినంత కాలం ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని మరువవద్దని, సామాజిక సేవను జీవితంలో భాగంగా భావించాలని పిలుపునిచ్చారు. ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దు భాస్కర రావు మాట్లాడుతూ ఇటీవల మరణించిన ముగ్గురు అడ్వొకేట్లు విప్పర్ల ఉషారాణి, అంగలకుదురు తిరుమల నటరాజన్, బొడ్డు ప్రసాదరావులు ఒంగోలు బార్ అసోసియేషన్‌కు అందించిన సేవలు వివరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు విజయలక్ష్మి, పందిరి లలిత, పూర్ణిమ, దీనా, పోక్సో కోర్టు జిల్లా న్యాయమూర్తి కానుగుల శైలజ, సీనియర్ సివిల్ న్యాయవాదులు హేమలత, రామకృష్ణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నారప రెడ్డి వసుంధర, అడ్వొకేట్లు మొలకలపల్లి అజయ్‌బాబు, బొజ్జా సురేంద్ర చక్రవర్తితోపాటు జూనియర్ న్యాయవాదులు, ఒంగోలు బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూలో పనులు పారదర్శకంగా చేపట్టాలి

- రెవెన్యూ దినోత్సవంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రెవెన్యూ శాఖలో పనులు పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ దినోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లాలో భూ సమస్యలతో పాటు వివిధ సర్టిఫికెట్స్ కోసం వచ్చే అర్జీపై రెవెన్యూ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరం పరిష్కరించి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో కలసి కేక్ కట్ చేశారు. వివిధ భూ సమస్యలపై, సర్టిఫికెట్స్ కోసం పేద ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు అర్జీలతో వస్తుంటారని, క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు వారి సమస్యలను సావధానంగా విని సత్వరం పరిష్కరించేలా పనిచేసినప్పుడే ప్రజల్లో రెవెన్యూ శాఖపై నమ్మకం ఏర్పడుతుందన్నారు.

ఈ సందర్భంగా రెవెన్యూశాఖలో ఉత్తమ సేవలందించిన రెవెన్యూ ఉద్యోగులను, పదవీ విరమణ చెందిన ఉద్యోగులను కలెక్టర్ సత్కరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి బుక్స్, రికార్డ్స్‌తో ఏర్పాటు చేసిన స్టాల్‌ను కలెక్టర్ తిలకించారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. తొలుత రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని మినీ స్టేడియం నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మినీ స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగింది. రెవెన్యూ దినోత్సవంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, పార్థ సారథి, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నాటోదయం!

జిల్లాలోని పల్లెలు, మారుమూల గిరిజన తండాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో సారా గుప్పుమంటోంది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న నాటుసారా తయారీ మళ్లీ పుంజుకుంటోంది. అధికార పార్టీ నేతల అండతో గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ జోరుగా దందా సాగిస్తున్నారు. దీనిని నిరోధించాల్సిన అధికారులు మొక్కుబడిగా దాడులు చేస్తూ అమ్మకందారులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊరూవాడా బెల్టు షాపులు వెలిశాయి. 24 గంటలూ మద్యం పుల్లుగా దొరుకుతోంది. ఒకవైపు అధికారికంగానే పీకల దాకా తాగిస్తూ మరో వైపు సారా రహిత జిల్లా అంటున్న అధికారులు, పాలకుల మాటలపై జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు. నాలుగు నెలలైనా ఒక్కరికి కూడా ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించిన దాఖలాలు లేవు.



- పశ్చిమాన పల్లెలు, తండాల్లో సారా దందా
- మారుమూల ప్రాంతాల్లో జోరుగా తయారీ
- నామమాత్రంగా అధికారుల దాడులు
- 29 కేసులు, 19 మంది అరెస్టు
- ఇప్పటి వరకూ 165 లీటర్ల నాటుసారా, 6,480 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- నవోదయం 2.0లో ఒక్కరికీ దక్కని ప్రత్యామ్నాయ ఉపాధి
- కూటమి పాలనలో ఊరూరా మద్యం
- జిల్లాలో ఎటుచూసినా బెల్ట్ షాపులు
- పీకలదాకా తాగిస్తూ సారా రహిత జిల్లా అంటూ కథలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణాలు, గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతుండగా, దానికి పోటీగా పట్టణ శివారు ప్రాంతాలు, పల్లెలు, గిరిజన తండాల్లో జోరుగా నాటుసారా విక్రయాలు జరుగుతున్నాయి. అధికారికంగా ప్రభుత్వం లైసెన్స్ మంజూరు చేసిన దుకాణాల కంటే అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపులే ఎక్కువగా ఉన్నాయి. దాంతో గతేడాది కాలంలో మద్యం విక్రయాలు విపరీతంగా పెరిగిపోయాయి. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా మందుబాబులు ఎక్కువైపోయారు. ప్రభుత్వం కూడా మద్యం విక్రయాలను మరింత పెంచాలని అధికారుల మీద ఒత్తిడి తెస్తోంది. ఒకవైపు పీకలదాకా మద్యం తాగిస్తూనే నవోదయం 2.0 పేరుతో మరోవైపు నాటుసారా రహిత జిల్లా గురించి ప్రభుత్వం మాట్లాడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సారా నిషాలో పల్లెలు...

పశ్చిమ ప్రకాశం జిల్లాలోని అనేక గ్రామాలు సారా మత్తులో జోగుతున్నాయి. జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాలు, తండాలు, గిరిజన గూడేల్లో విచ్చలవిడిగా సారా కాస్తున్నట్లు తెలుస్తోంది. యర్రగొండపాలెం మండలంలోని పాలుట్లలో సారా రాజ్యమేలుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పూర్తిగా నల్లమల అటవీ ప్రాంతంలో ఉండడంతో అధికారులు కూడా అటువైపు వెళ్లేందుకు సాహసించడంలేదు. దాంతో ఎవరికి ఎంత కావాలంటే అంత సొంతంగా కాసుకుని విక్రయాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేగాకుండా పాలుట్ల సమీపంలో ఉన్న తండాలకు, చెంచు గూడేలకు కూడా తరలించి విక్రయిస్తున్నట్లు సమాచారం. అలాగే యర్రగొండపాలెం మండలంలోని పెద్ద పీఆర్‌సీ తండా, చిన్న పీఆర్‌సీ తండా, పిల్లికుంట, నరజాముల తండాలలో సారా కాస్తున్నట్లు సమాచారం. పుల్లలచెరువు, దోర్నాల మండలాల్లో, గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు మండలంలోనూ యథేచ్ఛగా సారా కాస్తున్నట్లు సమాచారం. అర్ధవీడు లోయలోని అచ్చంపేట, పాపినేనిపల్లి, బొల్లుపల్లి గ్రామాలతో పాటుగా నల్లమల అటవీ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో సారా తయారీ నిత్యకృత్యంగా మారినట్లు చెబుతున్నారు. కంభం మండలంలోని లింగాపురం ప్రాంతంలో కూడా సారా వాసన వస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అర్ధవీడు లోయలో తయారు చేసిన సారాను కంభం, బేస్తవారిపేట మండలాలకు తరలించి విక్రయిస్తున్నట్లు సమాచారం. దోర్నాల మండలంలోని నల్లగుంట్ల, పనుకుమడుగు, బన్నంబావి, చిలకచర్ల, తుమ్మలబయలు, ధీఎంసీ కాలనీలు నాటు సారా ప్రభావిత ప్రాంతాలుగా అధికారులు గుర్తించారు. అయితే 8 మండలాలలో 35 గ్రామాలను సారా పీడిత గ్రామాలుగా గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 165 లీటర్ల నాటుసారా, 6,480 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు, 270 కేజీల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కలు చూస్తుంటే దాడులు ఎంత మొక్కుబడిగా సాగుతున్నాయో అర్థమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రత్యామ్నాయం చూపడంలో నిర్లక్ష్యం...

నాటు సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో ఏ ఒక్కరికీ ప్రత్యామ్నాయం చూపిన దాఖలాలు లేవు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కూడా అరెస్టులు, బైండోవర్ల గురించి ఏకరువు పెట్టారేగానీ ఎంతమంది నాటుసారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపారో చెప్పలేదు. దీంతో గ్రామాల్లో అనేక ఏళ్ల తరబడి నాటుసారా తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్న వారు ఇప్పుడు కూడా అదేవృత్తి కొనసాగించడానికి ఆసక్తి చూపుతున్నారు. కొంత మంది మాత్రం బెల్టు షాపులు పెట్టుకుని మద్యం విక్రయాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే నాటుసారా తయారీ కొనసాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నత్తనడకన నవోదయం...

నవోదయం 2.0ను ప్రకాశం జిల్లా నుంచే ప్రారంభించారు. మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభమైన నవోదయం జిల్లాలో నత్తనడక నడుస్తోంది. నేటికి నాలుగు నెలలైనప్పటికీ సాధించిన ప్రగతి శూన్యమని ఆరోపణలు ఉన్నాయి. కేవలం 29 కేసులు మాత్రమే నమోదు చేయడం, 19 మందిని అరెస్టు చేయడం చూస్తే నవోదయం ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇట్టే తెలిసిపోతోందని చెప్పవచ్చు. నాటు సారా మీద నామమాత్రపు దాడులు నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నాటుసారా కంటే మద్యం మీదనే ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సారా కంటే మద్యం వ్యాపారుల నుంచి వచ్చే మామూళ్లే ఎక్కువగా ఉండటం దీనికి కారణంగా చెప్పుకుంటున్నారు. దీంతోపాటు సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. సెప్టెంబర్ చివరినాటికి జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. అరకొర సిబ్బందితో ఇది సాధ్యమయ్యేపని కాదని ఆ శాఖ ఉద్యోగులే గుసగుసలాడుతున్నారు.

సారా సరే.. మద్యం సంగతేంటి...

జిల్లాలో ప్రభుత్వం అధికారికంగా మద్యం దుకాణాలు నిర్వహించుకునేందుకు 189 మందికి లైసెన్సులు మంజూరు చేసింది. దాదాపుగా ఈ మద్యం దుకాణాలన్నీ అధికార కూటమి నాయకులు, కార్యకర్తలే దక్కించుకున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా ఊరూరా బెల్టు షాపులు పెట్టారు. ప్రస్తుతం జిల్లాలో 2500 బెల్టుషాపులున్నట్లు అంచనా. ఒక మద్యం దుకాణానికి అనుబంధంగా కనీసం 10 నుంచి 15 వరకూ బెల్టు దుకాణాలు పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో మంచినీరు దొరకని గ్రామాలు అనేకం ఉన్నాయిగానీ.. మద్యం దొరకని గ్రామం కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదన్న ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం కూడా 20 శాతం అదనంగా మద్యం విక్రయాలు పెంచాలని అధికారుల మీద ఒత్తిడి చేస్తోందంటే.. మరింత మందితో మద్యం తాగించమని చెబుతున్నట్లే కదా అని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. కూటమి ప్రభుత్వం మద్యం పాలసీతో మందుబాబులు ఎక్కువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి చేత మద్యం తాగించి సంపద సృష్టిస్తున్నారని వాఖ్యానిస్తున్నారు.

మహిళా కార్మికులకు నైట్ డ్యూటీలొద్దు

- ఉత్తర్వులు రద్దుచేయాలని సీఐటీయూ ధర్నా



పనిగంటలు తగ్గించాలని కోరుతూ నిరసన చేస్తున్న ప్రజా సంఘాలు

ఒంగోలు టౌన్: మహిళా కార్మికులకు నైట్ డ్యూటీలు వేయడం దుర్మార్గమని, వెంటనే ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అయినా మహిళలకు నైట్ డ్యూటీలు వేయడమేమిటని ప్రశ్నించారు. ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. పనిగంటల పెంపు, మహిళా కార్మికులకు నైట్ డ్యూటీల విధింపులకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రకాశం భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంటెనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని వేళలను 10 గంటలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అలాగే మహిళలకు నైట్‌డ్యూటీ వేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, కార్మికులు, ప్రజలు కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిగట్టుకొని 29 లేబర్ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చారని చెప్పారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను నిర్వీర్యం చేయడం, యూనియన్ల రిజిస్ట్రేషన్లకు ఆటంకం సృష్టించడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను డొంకదారిలో నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాలకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఇటీవల మహిళా వీఆర్వోలకు నైట్ డ్యూటీ వేస్తే పోరాడి రద్దు చేయించుకున్నారని, కార్మికులు, ఉద్యోగులు సంఘటితంగా పోరాడితే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆర్.మోహన్, ఎం.అయ్యపు రెడ్డి, చీకటి శ్రీనివాసరావు, సీహెచ్ చిరంజీవి, జి.రమేష్, పి.కల్పన, టి.రాము, వి మోజెస్, పి.ఆంజనేయులు, సయ్యద్ మున్వర్ బాషా, పేరయ్య, డీకే రావు, హరిబాబు, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హింసా రాజకీయాలను సమర్థించదు

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ హింసా రాజకీయాలను సమర్థించదు, ప్రోత్సహించదని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు హింసా రాజకీయాలను ప్రోత్సహిస్తూ, రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తుంటే మరో పక్క టీడీపీ కార్యకర్తలు చేస్తున్న దౌర్జన్యాలు, దమనకాండ, పోలీసుల అండ చూసుకుని ఇంకా రెచ్చిపోతూ ఆ పార్టీ కార్యకర్తల కక్ష్యపూరిత చర్యలకు బాధపడి, కడుపుమండి ఎవరో ఫ్లెక్సీలో పెట్టిన సినిమా డైలాగును వైఎస్సార్ సీపీకి ఆపాదిస్తూ కూటమి నేతలు చిలువలు పలువలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

టీడీపీ నాయకులు హింసను ప్రేరేపించేలా మాట్లాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సినిమా డైలాగులు పెడితేనే ఈ విధంగా రాద్ధాంతం చేస్తుంటే సాక్షాత్తు టీడీపీ నాయకులు అవినీతి సొమ్ము పంపిణీ లావాదేవీల్లో చెలరేగిన గొడవల్లో ఇటీవల ఒంగోలు లో జరిగిన ఘటనలో టీడీపీ నాయకుడిని 60కి పైగా కత్తిపోట్లు పొడిచారని ..ఈ రపరప.. ఘటనను ఏమంటారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఏనాడూ హింసను ప్రోత్సహించలేదని, శాంతి భద్రతలను పార్టీ పరిరక్షించిందని గుర్తుచేశారు. హింసకు ఎప్పుడూ పార్టీ దూరంగా ఉంటుందని కూటమి ప్రభుత్వం హింసను విడనాడి శాంతిని పరిరక్షించాలని హితవు పలికారు.

నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే కొంటుంది

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



బర్లీ పొగాకును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే, ఇతర అధికారులు

మద్దిపాడు: జిల్లాలో రైతులు పండించిన నల్ల బర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం ఆమె ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి గుండ్లాపల్లి సమీపంలోని గార్లపాడు పునరావాస కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన బర్లీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. జిల్లాలోని మద్దిపాడు, చీమకుర్తి, పామూరు, దొనకొండ, కొత్తపట్నం, ముండ్లమూరు, పొదిలి, తాళ్లూరు, నాగులుప్పలపాడు, ఒంగోలు మండలాల్లో 1088 మంది రైతులు 50,380 క్వింటాళ్ల నల్ల బర్లీ పొగాకును పండించారన్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ హెచ్‌డీఎం రకం పొగాకును కిలో రూ.120 వంతున, హెచ్‌డీఎక్స్ రకం పొగాకును రూ.60 వంతున కొనుగోలు చేస్తామని తెలిపారు. పొగాకు రైతులు బేళ్లలో తేమ శాతం 20 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని, రెలుపు ఉన్న బేళ్లు అయితే మంచిది అన్నారు. మార్క్‌ఫెడ్‌కు అమ్ముకునే రైతులు ముందుగా వివరాలను సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. అలా నమోదు చేసుకున్న రైతులకు ఏరోజు ఏ ప్లాట్ ఫాంకు పొగాకు తీసుకురావాలో వారి మొబైల్‌కు ముందస్తుగా సందేశం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్‌బాబు, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీఓ డీఎస్‌వీ ప్రసాద్, వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం ఫ్లోర్ లీడర్ శేషగిరిరావు, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పలువురు పాల్గొన్నారు.



యోగా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

దైనందిన జీవితంలో యోగ భాగంగా మారాలి



యోగాసనం వేస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు: యోగ ప్రతి ఒక్క వ్యక్తి దైనందిన జీవితంలో భాగంగా మారాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక మినీ స్టేడియంలో శుక్రవారం స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన సామూహిక యోగ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పతంజలి యోగ రాష్ట్ర అధ్యక్షుడు గంధవళ్ల బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగ కార్యక్రమం జిల్లాలోని 6,458 ప్రదేశాల్లో సుమారు 11 లక్షల మందితో ఒకే సమయంలో యోగ కార్యక్రమం నిర్వహించనున్నామని, ప్రతి ఒక్కరూ అంతర్జాతీయ యోగ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ యోగ గొప్పతనాన్ని తెలియచేయాలన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గాయకుడు నూకతోటి శరత్ కుమార్ రూపొందించిన యోగ గేయాన్ని కలెక్టర్ ఆవిష్కరించగా గేయాన్ని శరత్ ఆలపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, బీఎన్ విజయ్‌కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, డీఆర్డీఏ, మెప్మా పీడీలు నారాయణ, శ్రీహరి, ఆయుష్ శాఖ ఆర్డీడీ పద్మజాతి, డీఈఓ కిరణ్ కుమార్, పశు సంవర్ధక శాఖ జేడీ రవి కుమార్, సెట్నల్ సీఈఓ శ్రీమన్నారాయణ, డీఎస్‌డీఓ రాజరాజేశ్వరి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ధ్యానముద్రలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

అన్ని గ్రేడులు కొనుగోలు చేయాలి

- పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు



రైతులతో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు, వైస్ చైర్మన్ బోడుపాటి బ్రహ్మయ్య

టంగుటూరు: పొగాకు కంపెనీ ప్రతినిధులు వేలం కేంద్రానికి వచ్చిన అన్ని పొగాకు గ్రేడులను కొనుగోలు చేయాలని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎమ్.లక్ష్మణరావు, వైస్ చైర్మన్ బోడుపాటి బ్రహ్మయ్య అన్నారు. పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎమ్.లక్ష్మణరావు, వైస్ చైర్మన్ బోడుపాటి బ్రహ్మయ్య శుక్రవారం టంగుటూరు వేలం కేంద్రాన్ని సందర్శించి పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు రైతులతో మాట్లాడుతూ రైతులంతా మండెలలో మగ్గిన పొగాకునే బేళ్లు కట్టుకుని అమ్మకానికి తీసుకురావాలని తెలిపారు. అలాగే మార్కెట్ కి అనుగుణంగా బేళ్లు తీసుకురావాలని సూచించారు. బేళ్లు అమ్మకానికి తెచ్చేటప్పుడు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మార్కెట్ దృష్ట్యా తెలపరి పొగాకు, నీళ్ల కట్టిన పొగాకును తీసుకురావొద్దని తెలిపారు. కొన్ని కంపెనీ వాళ్ల కొనుగోలు చేసిన బేళ్లలో అన్య పదార్థాలు ఉన్నందున కస్టమర్స్ వాటిని తిరస్కరించారని తెలిపారు. రైతులందరూ తమ బేళ్లలో ఎటువంటి పొగాకేతర అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. కంపెనీ కొనుగోలుదారులకు అన్ని రకాల గ్రేడ్ పొగాకును కొనుగోలు చేయాలన్నారు.

‘పని’కిరాని వాళ్లకు
హాజరు

- ఇంటి వద్ద సంతకాలు తీసుకోవడమేంటి?
- మేట్ మాయాజాలంపై ఉపాధి హామీ కూలీల ఆగ్రహం
- బేస్తవారిపేటలో ఏపీఓ, టీఏను నిలదీసిన ఒందుట్ల వాసులు


ఏపీఓను నిలదీస్తున్న కూలీలు

బేస్తవారిపేట: ‘ఉపాధి హామీ పథకాన్ని అవినీతిమయంగా మార్చేశారు. మేము శుక్రవారం పని చేసినా హాజరు వేయలేదు’ అంటూ కూలీలు పని ప్రదేశం నుంచి నేరుగా వచ్చి అధికారుల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటన బేస్తవారిపేట ఏపీఓ కార్యాలయం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని ఒందుట్లకు చెందిన ఉపాధి హామీ కూలీలు ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, టీఏ పి.పీరారెడ్డి వద్దకు చేరుకుని సీనియర్ మేట్ తీరుపై విరుచుకుపడ్డారు. సీనియర్ మేట్ ప్రతి రోజూ పనిచేసే కూలీలకు అన్యాయం చేస్తూ, పనికి రాని వారికి మాత్రం హాజరు వేస్తున్నాడని ఆరోపించారు. ఈ నెలలో రోజూ పనికి వెళ్లినప్పటికీ వారం రోజులు హాజరు వేయలేదన్నారు. కొందరికి ఆరు రోజులు పనికి వెళ్తే ఐదు రోజులుగా చూపించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కాపురం ప్రాంతంలో ఉండే లక్కాకుల శ్రీనివాసులు, సూరం గురువారెడ్డి, ఆకుకూరలు అమ్ముకునే సూరం రాజశేఖరరెడ్డి, 80 ఏళ్ల వృద్ధులు తోట బుడ్డయ్య, గోవిందమ్మ ఇలా అనేక మందికి దొంగ హాజరు వేస్తున్నాడని ఆరోపించారు. రోజూ కష్టపడి పని చేసే తమకు తక్కువ కూలి పడుతోందన్నారు. ఒక వర్గానికి చెందిన వారు పనిచేయకుండా హాజరు సమయానికి, ఫొటోలు దిగేందుకు వస్తున్నారని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. పని ప్రదేశంలో కాకుండా ఇంటి దగ్గర సంతకాలు పెట్టించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 10 గంటలకు పని అయిపోయినప్పటికీ ఆలస్యంగా వచ్చి ఇబ్బంది పెట్టడం సరి కాదన్నారు. ‘కొందరికి మాత్రమే పని డిమాండ్ పెడతాను, మీ దిక్కున్నవారికి చెప్పుకోండి. నాకు ఎమ్మెల్యే అండ ఉంది, కలెక్టర్, అధికారులు నన్ను ఏమీ చేసుకోలేరు’ని దబాయిస్తూ బూతులు తిడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ మేట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కూలీలు అర్జీ అందజేశారు. న్యాయం చేయకపోతే సోమవారం నుంచి ఏపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకనే..

ఉపాధి హామీ కూలీల ఫొటోలు ఇష్టారీతిగా అప్‌లోడ్ చేయడం, పాత పనులనే కొత్తగా చేసినట్లు చూపడం, ఒకే ఫొటోను అప్‌లోడ్ చేసి అందరికీ మస్టర్ వేయడం.. లాంటివి నిత్యకృత్యమయ్యాయి. కొందరు కూలీలు కూడా ఇదేదో బాగుందిలే పనికి వెళ్లకుండానే రూ.200 పోయిన రూ.1000 వస్తున్నాయి కదా అని మేట్లకు వారు అడిగినంత డబ్బు ఇస్తుండటం గమనార్హం. పలు గ్రామాల్లో అయితే స్థానికగా లేకున్నా మస్టర్లు వేస్తూ వారు పనికి వచ్చినట్లుగా జాబ్‌కార్డు నంబర్లు పెట్టి వారి స్థానంలో మరొకరు ఫొటోలు దిగుతున్నారు. ఇటీవల మంగాపురంలో మేట్ చేస్తున్న అవినీతిని పలువురు ప్రశ్నించగా ‘కచ్చితంగా డబ్బు ఇస్తేనే మీకు నగదు పడేలా చేస్తాం. లేకుంటే మీకు దిక్కున్నచోట చెప్పుకోండి. మమ్మల్ని ఎవరు ఏమీ చేయలేరు’అంటూ మేట్ తెగేసి చెప్పాడు. పనికి వచ్చిన వారికి మస్టర్ వేయకుండా, పనికి రాని వారికి హాజరు వేయడం ఏమిటని కూలీలు నిలదీస్తున్నా సమాధానం లేదు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వ్యక్తులపై ఉన్నతాధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా కొనకనమిట్లలో అయితే ఎక్కడో ఉంటున్న వారికి మస్టర్ వేసి డబ్బు పంచుకుంటున్నారని ఇటీవల కొందరు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. దీనిపై ఏపీడీ తూతూ మంత్రం నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు. ఉపాధి పనుల్లో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు స్పందించి అవకతవకలపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కొనకనమిట్లలో ఊర్లో లేనివారికి మస్టర్ వేసిన దృశ్యం

రూ.1200 తీసుకో.. రూ.200 ఇవ్వు!

- పనికి వెళ్లకపోయినా ఫర్వాలేదు, మీ అకౌంట్‌లో డబ్బు
- చేతివాటం ప్రదర్శిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు


మంగాపురంలో కూలీల నుంచి డబ్బు తీసుకుంటున్న మేట్

కొనకనమిట్ల: ‘వారానికి రూ.200 ఇవ్వండి మీకు రూ.1200 పడేలా చేస్తాం..’ ఇదీ ప్రస్తుతం ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గ్రామాలలో నడుస్తున్న తంతు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అధికారుల సహకారంతో వారు పెట్టిన మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు యథేచ్ఛగా అవకతవకలకు పాల్పడుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక జాబ్ కార్డులో నలుగురు ఉంటే వారిలో ఒకరు పనికి వెళ్లి వస్తే చాలు మిగతా వారికి కూడా వారానికి ఒకసారి అకౌంట్‌లో నగుదు జమ చేస్తున్న తీరు చర్చనీయాంశమైంది. కొనకనమిట్ల మండలం మంగాపురం గ్రామంలో చేసిన పనులకు సంబంధించి ఒక్కో కూలీ నుంచి రూ.200 చొప్పున మేట్ వసూలు చేసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఒకరికి రూ.1200 కూలి పడితే అందులో నుంచి మేట్ రూ.200 వసూలు చేస్తున్నాడు. అది కూడా వారానికి ముందే డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేయడం గమనార్హం. దీనిపై ఎంపీడీఓ ఈశ్వరమ్మను వివరణ కోరగా.. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చామని చెప్పారు.



సోనాబోట్ల
విధ్వంసం

సింగరాయకొండ: తమిళనాడు రాష్ట్రం కడలూరు ప్రాంతానికి చెందిన సోనాబోట్లు విచ్చలవిడిగా వేట సాగిస్తున్నాయి. సింగరాయకొండ మండలంలోని పాకల, ఊళ్లపాలెంలో సముద్ర తీరానికి సమీపంలో యథేచ్ఛగా వేట సాగిస్తుండటంతో స్థానిక మత్స్యకారులు లక్షలాది రూపాయల విలువైన వలలు నష్టపోతూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇటీవల కాలంలో రాత్రీ పగలు తేడాలేకుండా సోనాబోట్లు తీరానికి సమీపంలో వేటాడుతున్నాయి. మత్స్యకారులు చేపల కోసం సముద్రంలో వేసి ఉంచిన వలలను సోనా బోట్లు తెంచేశాయి. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎవరికి మొరపెట్టుకోవాలో అంతుపట్టడం లేదని మత్స్యకారులు గగ్గోలు పెడుతున్నారు. గత రెండు రోజుల్లో సుమారు లక్ష రూపాయలకు పైగా విలువైన వలలు నష్టపోయామని, చేపలు కూడా చిక్కడం లేదని మత్స్యకారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సోనాబోట్లు తీరానికి దూరంగా వేట సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రూ.50 వేలు నష్టపోయా

మంగళవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లా. పులసరకం వల వదిలి తిరిగి రాత్రి ఒంటి గంట సమయంలో వద్దామని నిర్ణయించుకున్నా. ఈలోగా సుమారు రాత్రి 11 గంటల సమయంలో సోనాబోటు తీరానికి దగ్గరగా చేపల వేట చేయటంతో వల తెగిపోయింది. దీంతో సుమారు 50 వేల రూపాయల వల నష్టపోయా.

– సంభ్యా సుబ్బారావు, ఊళ్లపాలెం

వల కొట్టుకుపోయింది



సముద్రంలో చేపల కోసం మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో వేటకు వెళ్లా. ఎంఎమ్ రకం వలను వదిలి సుమారు 11 గంటల సమయంలో తిరిగి వద్దామనుకున్నా. కానీ 10 గంటల సమయంలో సోనాబోట్ల కారణంగా నా వల తెగిపోయి సముద్రంలో కొట్టుకుపోయింది. మిగిలిన వలను ఒడ్డుకు చేర్చుకుని బాగు చేసుకుంటున్నా. సుమారు 20 వేల రూపాయల వల నష్టపోయా.

– వల్లభుని నాగరాజు, మత్స్యకారుడు, ఊళ్లపాలెం



రూ.10 వేల వల తెగిపోయింది

సముద్రంలో చేపల కోసం గురువారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో చేపల వేటకు వెళ్లి ఎంఎం రకం వల వదిలి విశ్రమించా. తరువాత సుమారు 4 గంటల సమయంలో సోనాబోటు నా వలను ధ్వంసం చేసింది. దీంతో 10 వేల రూపాయల వల నష్టపోయా.

– సైకం మధు, దేవలం పల్లెపాలెం, ఊళ్లపాలెం

మిగిలిన వలను బాగుచేసుకుంటున్నా

సముద్రంలో చేపల వేటకు బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లి ఎంఎం రకం వల వదిలాను. తరువాత సోనాబోటు నా వలను ధ్వంసం చేయడంతో సుమారు 30 వేల రూపాయల వల సముద్రంలో కొట్టుకుపోయింది. మిగిలిన వలను తీరానికి తీసుకొచ్చి బాగు చేసుకుంటున్నా.

– తంబు స్వాములు, ఊళ్లపాలెం

క్లుప్తంగా

ఈవీఎం గోడౌన్‌లో పటిష్ట భద్రత

- మామిడిపాలెంలోని గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్


ఈవీఎంలు పరిశీలిస్తున్న కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఒంగోలు సబర్బన్: జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు ఉంచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఒంగోలు నగరంలోని మామిడిపాలెంలో ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం స్టేట్ ఎలక్షన్ డిప్యూటీ సీఈఓ విశ్వేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం యంత్రాలు బీయూలు, సీయూ, వీవీప్యాట్లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస రావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, వివిధ పార్టీల నేతలు వెంకటరావు, గుర్రం సత్యం, మాకినేని అమర్ సింహ, ఎస్‌కే రసూల్, రాజశేఖరరెడ్డి, ఉపేంద్ర, నవీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ఒంగోలు సిటీ: డీఎస్సీ 1998, డీఎస్సీ 2008 లకు చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్లకు (ఎంటీఎస్) ఈ నెల 22వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఒంగోలులోని డీఆర్‌ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఉపాధ్యాయులందరూ కౌన్సెలింగ్ కు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

అమ్మ మందలించిందని.. ఉరేసుకుని బాలిక మృతి


బాలిక మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రభాకరరావు

యర్రగొండపాలెం: మండలంలోని పాత గోళ్లవిడిపి గ్రామంలోని ఎస్సీ పాలెంలో బాలిక ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై పి.చౌడయ్య కథనం ప్రకారం.. 8వ తరగతి వరకు చదువుకున్న బరిగెల శైలమ్మ(16) రెండేళ్ల క్రితం స్కూల్‌కు వెళ్లడం మానేసింది. పాఠశాలకు వెళ్లినట్లయితే తన అకౌంట్‌లో తల్లికి వందనం డబ్బులు జమ అయ్యేవని, ఇప్పుడైనా బడికి వెళ్లి చదువుకోమని ఆ బాలికను తల్లి మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శైలమ్మ ఇంట్లో ఎవరూలేని సమయంలో గురువారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు తన చున్నీతోనే ఉరివేసుకుంది. తన సోదరి మరణానికి గల కారణాలు తెలుసుకున్న అన్న ఎలిషాబాబు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ సీహెచ్ ప్రభాకరరావు పరిశీలించారు.

నిరుద్యోగులకు కూటమి కుచ్చుటోపీ

23న యువత పోరుబాటను విజయవంతం చేయాలి

- నిరుద్యోగ భృతి హామీని కూటమి సర్కారు విస్మరించింది
- మేనిఫెస్టోలో పేర్కొన్నట్టుగా నెలకు రూ.3 వేలు ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు


మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే వరకు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం విస్మరించి నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విమర్శించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేసేలా కూటమి సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 23న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించనున్న యువత పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మార్కాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒంగోలులోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద యువత పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మార్కాపురం నియోజకవర్గంలోని నిరుద్యోగులైన యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కూటమి ప్రభుత్వం హామీని అమలు చేయకుండా గత ఏడాది కాలంగా యువతీ యువకులకు రూ.36 వేల చొప్పున ఎగనామం పెట్టిందని ధ్వజమెత్తారు. సమావేశంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జంకె కృష్ణారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు బి.వెంకట రామిరెడ్డి, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల యూత్ అధ్యక్షుడు బి.రమేష్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, నాయకులు మురారి వెంకటేశ్వర్లు, రామసుబ్బారెడ్డి, సర్పంచ్ డి.పెద్దమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు ఇప్పించడంలో రాష్ట్రం విఫలం



పొగాకు రైతుల సదసులో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

ఒంగోలు టౌన్: పొగాకు రైతులకు గిట్టుబాటు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు ఇప్పించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి అన్నీ రకాల పొగాకును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో శుక్రవారం పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేవీవీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పొగాకు రూపంలో వేల కోట్లు పన్నుల రూపంలో విదేశీ మారకద్రవ్యం వస్తుందని, అయినా పొగాకు రైతులకు న్యాయం చేయాలన్న ధ్యాస లేదని మండిపడ్డారు. ధాన్యం రైతులను కూడా ప్రభుత్వం బజారున పడేసిందని మండిపడ్డారు. మద్దతు ధర కంటే రూ.200 నుంచి రూ.300 తక్కువకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఎగుమతి విధానాలు బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయన్నారు. అందుకే రైతులు నష్టపోతున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. విదేశాల్లో పొగాకు సాగు లెక్కలను అంచనా వేసుకొని మన దేశంలోని రైతులకు పొగాకు సాగు చేయాలని సూచనలు చేయకుండా నిర్లక్ష్యం చేసిన బోర్డు అధికారులు ఇప్పుడు విదేశాల్లో పొగాకు పంట ఎక్కువ సాగయ్యిందని చెప్పడం క్షమార్హం కాదన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ ఐటీసీ మోచేతి నీళ్లు తాగే కొందరు తొత్తు రైతు నాయకులు చేస్తున్న మోసాన్ని పొగాకు రైతులు గమనించాలని కోరారు. వారి పంటలకు మాత్రం గిట్టుబాటు ధరలు దక్కించుకుంటున్నారని, మిగిలిన రైతులకు ధరలు రాకుండా చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. డబుల్ ఇంజిన్ సర్కార్లో ఏ పంటకూ గిట్టుబాటు ధరలు లేవని, ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు నాయకులు చుంచు శేషయ్య మాట్లాడుతూ పొగాకు కేంద్రాల్లో లో గ్రేడ్ రకాన్ని కొనుగోలు చేసే నాథుడే లేకుండా పోయాడని చెప్పారు. కార్యక్రమంలో రైతు నాయకులు పమిడి వెంకటరావు, పరిటాల కోటేశ్వరరావు, కోడూరు నాంచార్లు, దేవరకొండ సుబ్బారెడ్డి, వడ్లేళ్ల ప్రసాద్, అబ్బూరి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో పాలకులు విఫలం

ఒంగోలు టౌన్: నగర ప్రజలకు సక్రమంగా, సరైన సమయంలో తాగునీటిని సరఫరా చేయడంలో నగర పాలకులు పూర్తిగా విఫమయ్యారని సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నగర ప్రజల దాహార్తిని తీర్చడంలో కార్పొరేషన్ పాలకులు చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. అర్ధరాత్రి అపరాత్రి మంచినీటిని సరఫరా చేయడం వల్ల నిదుర కళ్లతో నీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోందని తెలిపారు. నగరంలో గతంలో మూడు రోజులకోసారి మంచినీటిని సరఫరా చేసేవారని, ఇప్పుడు నాలుగు రోజులు, ఐదు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారని తెలిపారు. అసలు పగటి పూట ఇస్తారో, రాత్రి పూట ఇస్తారో తెలియని దుస్థితి ఏర్పడిందన్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకొని కుటుంబాలను పోషించుకునే నిరుపేద ప్రజలు నిద్ర పోవడానికి అవకాశం లేకుండా రాత్రి ఒంటి గంటకు నీరొదలడం పాలకుల అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. సరిగ్గా నగర ప్రజలకు మంచినీటిని అందించలేని పాలకులు నగరాన్ని సుందరంగా తీర్చుదిద్దుతామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. నిరంతర విద్యుత్ కోతలు, తరచుగా పైప్ లైన్లు పగలడం వంటి కారణాలను పరిష్కరించుకోలేకపోతే ఇంతమంది అధికారులు ఉండి ప్రయోజనం ఏమిటన్నారు.


విద్యుత్ కోత సమయంలో జనరేటర్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాలకవర్గం, అధికారుల అవినీతి కారణంగా నాణ్యమైన మోటార్లు, పైపులు కొనుగోలు చేయకపోవడం వల్ల కూడా నీటి సరఫరాలో సమస్యలొస్తున్నాయని వివరించారు. శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసే విషయంలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. కాలనీల్లో ఇంటికి కేవలం రెండు డ్రమ్ముల నీటిని మాత్రమే ఇస్తుండటంతో అవి సరిపోక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా మూడు రోజులకోసారి మంచినీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారని, దానిని అమలు చేయడం లేదని విమర్శించారు. మంచినీటి సమస్యను పరిష్కరించకుంటే నగర పాలక సంస్థ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

లాసెట్‌లో నల్లగుంట్ల విద్యార్థి ప్రతిభ


లాసెట్‌లో 1377వ ర్యాంకు సాధించిన ఇస్మాయిల్‌అలీ

కొమరోలు: మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ అలీ లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో 1377వ ర్యాంకు సాధించాడు. ఇస్మాయిల్ అలీ గతంలో పీజీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 99వ ర్యాంకు, 2020లో నిర్వహించిన పీజీ సెట్‌లో 2వ ర్యాంకు, 2022లో ఏపీఆర్‌సెట్ వృక్షశాస్త్రం విభాగంలో 15వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. తాజాగా లాసెట్‌లో ప్రతిభ చూపిన అలీని గ్రామస్తులు అభినందించారు.

బాధ్యతలు చేపట్టిన డీవైఈఓ


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరెడ్డి

మార్కాపురం: మార్కాపురం డీవైఈఓగా నియమితులైన మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పొదిలి ఎంఈఓగా పని చేస్తూ బదిలీపై మార్కాపురం డీవైఈఓగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన డీవైఈఓను ఎంఈఓ శర్వాణి, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, సుబ్బారెడ్డి, రామాంజనేయరెడ్డి, సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వీరారెడ్డి, రవిశేఖర్, సైమన్, రవిచంద్ర తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.